సాక్షి విశాఖపట్నం

11

బుధవారం । 13 । ఆగస్టు । 2025

హర్ ఘర్ తిరంగా





బీచ్‌రోడ్‌లో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పాల్గొని, భవిష్యత్ తరాల్లో దేశభక్తిని, స్వాతంత్య్ర స్ఫూర్తిని పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బైక్ ర్యాలీ, వస్తు ప్రదర్శన, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

వైఎస్ జగన్‌కు వివాహ ఆహ్వానం



జగన్‌కు శుభలేఖ అందజేస్తున్న బాణాల శ్రీనివాసరావు, చిత్రంలో కేకే రాజు

సీతంపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజుతో కలిసి జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు మంగళవారం తాడేపల్లిలో కలిశారు. ఈ నెల 14వ తేదీ రాత్రి రుషికొండ బీచ్‌రోడ్‌లోని ఏ-1 కన్వెన్షన్‌లో జరగనున్న తన చిన్న కుమారుడు బాణాల వరుణ్ కుమార్ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ శుభలేఖను అందజేశారు.

40 నిమిషాల్లో వాక్యూమ్ క్లీనర్ తయారీ



గురుకుల విద్యార్థులతో ప్రిన్సిపాల్ రత్నవల్లి, సైన్స్ అధికారి రాజారావు

ఆరిలోవ: శ్రీ కృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్) కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా మంగళవారం జరిగిన ఈ ఆన్‌లైన్ కార్యక్రమంలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉన్న 50 మంది విద్యార్థులు పది గ్రూపులుగా విడిపోయారు. కేవలం 40 నిమిషాల వ్యవధిలో వారు వాక్యూమ్ క్లీనర్ తయారీ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను గురుకుల ప్రిన్సిపాల్ రత్నవల్లి, జిల్లా సైన్స్ అధికారి రాజారావు పరిశీలించి, అభినందించారు. తక్కువ సమయంలో ఇంతటి క్లిష్టమైన ప్రాజెక్టును పూర్తి చేయడం అద్భుతమని పేర్కొన్నారు. ఇలాంటి ప్రాజెక్టుల్లో పాల్గొనడానికి విద్యార్థులకు మరింత ప్రోత్సాహం అవసరమన్నారు. గురుకుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

97.99 శాతం మందికి ఆల్బెండజోల్ మాత్రలు

మహారాణిపేట: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లాలో 1 నుంచి 19 ఏళ్లలోపు బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. జిల్లాలో 5,15,264 మందికి గాను 5,04,958 మందికి మాత్రలు వేసినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. తొలి రోజు 97.99 శాతం మందికి మాత్రలు వేశామని, మిగతా వారి కోసం ఈనెల 20న మాప్ అప్ రౌండ్ నిర్వహిస్తామన్నారు.

వృద్ధ ఖైదీ మృతిపై ఆర్డీవో విచారణ

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో గుండెపోటుతో మరణించిన వృద్ధ ఖైదీ ఘటనపై ఆర్డీవో మంగళవారం విచారణ జరిపారు. జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు తెలిపిన వివరాలు.. ఆరిలోవ ప్రాంతానికి చెందిన కె.బాలయోగి(75) పోక్సో కేసులో 2022 అక్టోబర్ 17 నుంచి జైల్ శిక్ష అనుభవిస్తున్నాడు. అతను ఆస్తమా, హైపర్ టెన్షన్‌తో బాధపడుతూ జైల్ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నాడు. ఇటీవల ఆరోగ్యం మరింత క్షీణించడంతో జైల్ సిబ్బంది మూడు సార్లు కేజీహెచ్‌కు తరలించి, వైద్యం అందించారు. సోమవారం మధ్యాహ్నం జైల్ క్యాంటీన్‌లో బిస్కెట్లు కొంటూ కుప్పకూలిపోయాడు. కొన ఊపిరితో ఉన్న బాలరాజును జైల్ అధికారులు మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. దారిలోనే అతను ప్రాణాలు విడిచాడు. దీనిపై ఆర్డీవో జైల్‌ను సందర్శించి విచారణ చేపట్టారు. అనంతరం కేజీహెచ్ మార్చురీలో శవ పంచనామా జరిపించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

అదానీ గంగవరం పోర్టు కొత్త రికార్డ్

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు సరికొత్త రికార్డ్ సాధించింది. మారిటైమ్ హబ్‌గా అవతరించింది. రికార్డు స్థాయిలో నౌక వేదాంత కోసం 1,77,121 మెట్రిక్ టన్నుల బాక్సైట్‌తో వచ్చిన నౌకను రికార్డు స్థాయిలో 18.2 డ్రాఫ్టుతో పోర్టులో నిలిపారు. దీంతో గతంలో అదానీ గంగవరం పోర్టు పేరిట ఉన్న 18.12 మీటర్ల రికార్డును తిరగరాసింది. లోడింగ్, అన్‌లోడింగ్ తర్వాత నౌక విజయవంతంగా తిరిగి వెళ్లింది. ఈ సందర్భంగా పోర్టు యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ ఇది తమ పోర్టు అద్భుత విజయమన్నారు. కస్టమర్ ఫస్ట్ విధానంలో భాగంగా ఈ ఘనత సాధించామన్నారు.

సుంకాల ఉచ్చులో రొయ్య

కుదేలైన ఆక్వా రంగం



- తగ్గిన రొయ్యల ఎగుమతులు
- ఇప్పటికే పతనమైన ధరలు
- భరోసా ఇవ్వని కూటమి ప్రభుత్వం



మహారాణిపేట: ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ ఆక్వా రంగానికి రాజసం తెచ్చిపెట్టి, విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించిపెట్టిన బంగారు రొయ్య.. నేడు అమెరికా వాణిజ్య విధానాల కారణంగా తన ఉనికినే కోల్పోయే ప్రమాదంలో పడింది. దేశ రొయ్యల ఉత్పత్తిలో అగ్రగామిగా.. ఆక్వా హబ్‌గా వెలుగొందుతున్న ఆంధ్రప్రదేశ్.. ముఖ్యంగా విశాఖ తీరం, మునుపెన్నడూ లేని సంక్షోభంలో చిక్కుకుంది. భారత ఉత్పత్తులపై అమెరికా 25 శాతం సుంకాన్ని విధించడంతో.. అంతర్జాతీయ మార్కెట్‌లో మన రొయ్యల పోటీ సామర్థ్యం దెబ్బతింది. ఫలితంగా ధరలు రికార్డు స్థాయిలో పతనం కావడం, ఎగుమతులు నిలిచిపోవడంతో లక్షలాది మంది ఆక్వా రైతులు, మత్స్యకారులు, పరిశ్రమ కార్మికుల భవిష్యత్తు అంధకారంలోకి జారుకుంది. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోకపోతే, ఈ సంక్షోభం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన, దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపడం ఖాయం.

కుప్పకూలిన ధరలు..

భారత రొయ్యల ఉత్పత్తులపై అమెరికా ఏకపక్షంగా 25 శాతం కస్టమ్స్ సుంకాన్ని విధించడమే ఈ సంక్షోభానికి మూల కారణం. ఇదే సమయంలో, ఈక్వెడార్ వంటి పోటీ దేశాలపై కేవలం 10 శాతం సుంకం విధించడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో భారత రొయ్యలకు డిమాండ్ తగ్గింది. ఫలితంగా ఎగుమతులు ఒక్కసారిగా నిలిచిపోయి, స్థానిక మార్కెట్‌లో ధరలు రికార్డు స్థాయిలో పతనమయ్యాయి. గతంలో 100 కౌంట్ రొయ్యల ధర రూ. 270 పలకగా, ఇప్పుడు అది రూ. 230కి పడిపోయింది. ఈ ధరల పతనంతో రైతులు టన్నుకు రూ. 50 వేల నుంచి రూ. 80 వేల వరకు నష్టపోతున్నారు. పంట చేతికొచ్చే సమయానికి ధరలు కూలిపోవడంతో, పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగిరాని పరిస్థితి నెలకొంది. ఈ దుస్థితిని ఆసరాగా చేసుకున్న స్థానిక వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

ఈ గండం నుంచి గట్టెక్కేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు చేపట్టాలని రైతులు, మత్స్యకారులు, పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. 'కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమెరికాతో దౌత్య, వాణిజ్యపరమైన చర్చలు జరిపి, సుంకాలను తగ్గించేలా లేదా పూర్తిగా తొలగించేలా ఒత్తిడి తీసుకురావాలి. నష్టపోయిన రైతులకు తక్షణమే ఆర్థిక ప్యాకేజీ ప్రకటించి ఆదుకోవాలి. టన్నుకు కనీస మద్దతు ధర ప్రకటించడం లేదా నష్టపరిహారం అందించడం వంటి చర్యలు చేపట్టాలి. విద్యుత్, రొయ్యల మేత వంటి కీలకమైన వాటిపై సబ్సిడీలను పెంచి, సాగు వ్యయాన్ని తగ్గించాలి. అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించి.. యూరప్, ఇతర ఆసియా దేశాల్లో కొత్త మార్కెట్లను అన్వేషించడానికి ఎగుమతిదారులకు ప్రభుత్వం ప్రోత్సాహం, సహకారం అందించాలి.' అని రైతులు కోరుతున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే.. రాబోయే సీజన్‌లో రొయ్యల సాగుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పరిశ్రమ భవిష్యత్తును మరింత ప్రమాదంలోకి నెడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పరిశ్రమపై ప్రభావం

ఈ సంక్షోభం కేవలం రైతులకే పరిమితం కాలేదు. దీని ప్రభావం మొత్తం సరఫరా గొలుసుపై పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 100–150 ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు, ముఖ్యంగా విశాఖ పరిసర ప్రాంతాల్లోని 15 ఫ్యాక్టరీలు ఎగుమతి ఆర్డర్లు లేక ఉత్పత్తిని భారీగా తగ్గించాయి. దీని వల్ల వేలాది మంది కార్మికులు, ముఖ్యంగా మహిళలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. రొయ్యల మేత, మందుల సరఫరాదారులు, ప్యాకేజింగ్ పరిశ్రమలు, రవాణా రంగంపై కూడా తీవ్ర ప్రభావం ఉంటుంది. ఏడాదికి రూ. 25వేల కోట్ల విలువైన రొయ్యలను ఎగుమతి చేసే ఈ కీలక రంగం కుదేలవడం రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థకు తీరని నష్టం కలిగిస్తోంది.

లోన్ యాప్‌లను నమ్మవద్దు

- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి
- నిందితుల నుంచి రూ.48 లక్షల రికవరీ
- బాధితులకు తిరిగి సొమ్ము అందజేత



నష్టపోయిన మొత్తాన్ని బాధితుడికి అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, డీసీపీ తదితరులు

అల్లిపురం: సైబర్ మోసాలపై పోలీసులు నిరంతరం అవగాహన కల్పిస్తున్నప్పటికీ.. చాలామంది ఇంకా సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోతున్నారని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. నగర ప్రజలు లోన్ యాప్‌లను నమ్మవద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో మంగళవారం లోన్ యాప్‌ల బాధితులకు నిందితుల నుంచి రికవరీ చేసిన రూ.48 లక్షలను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ లోన్ యాప్ కేసులో సీజ్ చేసిన క్రిప్టో కరెన్సీని ఇండియన్ కరెన్సీలోకి మార్చినట్లు చెప్పారు. ఈ మోసాల్లో బాధితులైన 295 మందిని గుర్తించామని, వారిలో దాదాపు వంద మంది ఎక్కువ మొత్తంలో డబ్బు నష్టపోయారని సీపీ వివరించారు. నిందితుల నుంచి రికవరీ చేసిన రూ.48 లక్షలను చట్టపరమైన ప్రక్రియల ద్వారా బాధితుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇన్‌స్టంట్ లోన్ యాప్‌ల నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనుమతి లేని యాప్‌ల ద్వారా రుణాలు తీసుకుని సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోవద్దని ఆయన సూచించారు. సైబర్ నేరగాళ్లు ఇచ్చే కమిషన్లకు ఆశపడి బ్యాంకు ఖాతాలు తెరిచి ఇవ్వడం, లేదా వాటిని సరఫరా చేయడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జల ప్రవాహంలో బిక్కుబిక్కుమని..

సరియా వద్ద చిక్కుకున్న 32 మంది పర్యాటకులు
రోప్ సహాయంతో రక్షించిన పోలీసు, ఫైర్ సిబ్బంది



సురక్షితంగా బయటపడ్డ పర్యాటకులు

దేవరాపల్లి: సుందర సరియా జలపాతం కొన్ని గంటలపాటు వారి వెన్నులో వణుకు పుట్టించింది. ఈ పర్యాటక ప్రాంతాన్ని చూద్దామని విశాఖ, గాజువాక, అనకాపల్లి ప్రాంతాల నుంచి వచ్చిన 32 మంది సందర్శకులు ప్రాణాలు అర చేత పెట్టుకొని బిక్కుబిక్కుమని గడిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండల పరిధిలోని సరియా జలపాతం సందర్శనకు మంగళవారం ఉదయం వీరు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో భారీ వర్షం రావడంతో జలపాతానికి ముందు ఉన్న గెడ్డ ఉప్పొంగి ఉధృతంగా ప్రవహించడంతో పర్యాటకులంతా అవతలి వైపు చిక్కుకుపోయారు. విషయం తెలుసుకున్న అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. దేవరాపల్లి, చీడికాడ ఎస్‌లు, అగ్నిమాపక, రెవెన్యూ అధికారులతో కలిసి సుమారు 3 గంటలపాటు శ్రమించారు. గెడ్డ ఉధృతి తగ్గిన తర్వాత రోప్ సహాయంతో ఒక్కొక్కరినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. రాత్రి 10 గంటల సమయంలో దేవరాపల్లి ప్రాంతానికి తీసుకువచ్చారు. స్థానికంగా పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి పర్యాటకులకు భోజనం సదుపాయం కల్పించారు.

'సృష్టి' అక్రమాల చిట్టా



ఈ భవనంలో 5, 6 అంతస్తుల్లో సృష్టి నడుస్తోంది.

మహారాణిపేట: పిల్లలు లేని దంపతుల ఆశలను సొమ్ము చేసుకుంటూ.. సరోగసీ, ఐవీఎఫ్ పేరుతో సృష్టి ఐవీఎఫ్ సెంటర్ పాల్పడిన అక్రమాలు రోజుకొకటి వెలుగులోకి వస్తున్నాయి. ఈ దారుణమైన దోపిడీకి విశాఖపట్నం కేంద్రంగా నిలిచిందని పోలీసుల దర్యాప్తులో తేలింది.

రిజిస్ట్రేషన్ లేకున్నా.. : సృష్టి ఐవీఎఫ్ సెంటర్ విశాఖలోని తన కార్యకలాపాలను రిజిస్ట్రేషన్ లేకుండానే కొనసాగిస్తోంది. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో 2018 నుంచి 2023 వరకు మాత్రమే ఈ సెంటర్ నిర్వహణకు రిజిస్ట్రేషన్ ఉంది. ఆ తర్వాత ఎలాంటి అనుమతులు లేకుండానే జిల్లా పరిషత్ సమీపంలోని ఒక భవనంలో 5వ, 6వ అంతస్తుల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ సెంటర్ నిర్వహణకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని కొందరికి లంచాలు ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డాక్టర్ నమ్రత ఆధ్వర్యంలో మేనేజర్ కల్యాణి ఈ దందాలో కీలకపాత్ర పోషించినట్లు పోలీసులు గుర్తించారు.

ఢిల్లీ నుంచి గర్భిణిని రప్పించి.. : పోలీసుల దర్యాప్తులో షాకింగ్ విషయాలు బయటపడుతున్నాయి. గత నెలలో విశాఖ సెంటర్‌లో మగబిడ్డ జన్మించినట్లు గుర్తించారు. ఢిల్లీకి చెందిన ఒక గర్భిణిని విమానంలో విశాఖకు తీసుకొచ్చి ఇక్కడ డెలివరీ చేయించి, ఆ బిడ్డను సరోగసీ ద్వారా పుట్టిందని వేరొక దంపతులను నమ్మించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. డాక్టర్ నమ్రత గతంలోనూ ఇలాంటి కోట్లాది రూపాయల అక్రమాలకు పాల్పడిందని, కొన్నేళ్ల కిందట రూ.30 లక్షలకు ఒక బిడ్డను కోల్‌కతాలోని దంపతులకు అమ్మకానికి పెట్టిందని పోలీసులు చెబుతున్నారు.

విశాఖ కేంద్రంగా అక్రమాలు

మంట గలిసిన కేజీహెచ్ ప్రతిష్ఠ

ఈ అక్రమాలతో కేజీహెచ్‌కు చెందిన వైద్యుల ప్రమేయం ఉన్నట్లు తేలింది. ఒక అనస్థీషియా, ఒక గైనిక్, పిల్లల వైద్యుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వీరంతా ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఒకే బ్యాచ్‌లో చదువుకున్నారని సమాచారం. ఇప్పటికే పోలీసులు నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో కూడా తనిఖీలు నిర్వహించారు. ఈ అక్రమాల వెనక ఎంత మంది ఉన్నారనేది తెలుసుకోవడానికి పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. తవ్వే కొద్దీ ఈ దందాలో కొత్త కోణాలు, కొత్త పేర్లు వెలుగులోకి వస్తున్నాయని సమాచారం.

కారు ఢీకొని చిన్నారి మృతి

తాటిచెట్లపాలెం: ఊర్వశి జంక్షన్, బీఆర్‌టీఎస్ రోడ్డులోని సుభాష్‌నగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక చిన్నారి మరణించింది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలివి. మంగళవారం సాయంత్రం కాశీమహంతి రాంబాబు తన 15 నెలల కుమారుడు వర్షిత్‌తో కలిసి రోడ్డు దాటుతున్నాడు. ఐటీఐ జంక్షన్ నుంచి ఊర్వశి జంక్షన్ వైపు వేగంగా వస్తున్న కారు వారిని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వర్షిత్ అక్కడికక్కడే మృతి చెందాడు. కంచరపాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

12 ఏళ్లుగా కళ్లు గప్పి.. ఎట్టకేలకు చిక్కి!

నవ వధువు హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడు నీలాపు లోకేష్‌ను సెంట్రల్ జైలుకు తరలిస్తున్న న్యూపోర్టు పోలీసులు

పెదగంట్యాడ: ఓ హత్య కేసులో 12 ఏళ్లుగా కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని న్యూపోర్టు పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు తెలిపిన వివరాలివి. 2013లో మండలంలో ఒక వీధిలోని నాలుగో అంతస్తు పెంట్‌హౌస్‌లో నవ వధువు త్రివేణి తన భర్తతో కలిసి నివసించేది. పక్కనే ఉన్న మరో పెంట్‌హౌస్‌లో అద్దెకు ఉంటున్న నీలాపు లోకేష్ ఆమెపై కన్నేశాడు. ఇంట్లో త్రివేణి ఒంటరిగా ఉండటం గమనించి, ఆ ఇంట్లోకి చొరబడ్డాడు. త్రివేణిపై లైంగికదాడికి ప్రయత్నించగా, ఆమె ప్రతిఘటించి వంటగదిలోకి వెళ్లిపోయింది. ఈ క్రమంలో లోకేష్ ఆమె మెడకు చున్నీ బిగించి హత్య చేశాడు. ఆ తర్వాత ఆమె మృతదేహం పక్కన చున్నీని కాల్చివేసి, గ్యాస్ తెరిచి ఉంచాడు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న రెండున్నర తులాల బంగారు ఆభరణాలతో పరారయ్యాడు. తర్వాత గాజువాకలోని ఒక ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో ఆ బంగారు ఆభరణాలను కుదువ పెట్టి రూ.55వేలు తీసుకున్నాడు. ఆ డబ్బులో రూ.30వేలతో బైక్ కొనుగోలు చేయడానికి అడ్వాన్స్‌గా ఇచ్చాడు. మిగతా రూ.25 వేలును తన స్నేహితునికి ఇచ్చి, ఏమీ తెలియనట్టుగా ఇంటికి చేరుకున్నాడు.

పోలీసులు పట్టుకున్నారిలా..

నవ వధువు హత్య కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు.. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు. అప్పటికే గాజువాక పోలీస్ స్టేషన్‌లో లోకేష్‌పై మోటార్ బైక్ దొంగతనం కేసు నమోదై ఉంది. దీంతో పోలీసులు తమదైన శైలిలో అతన్ని విచారించగా.. త్రివేణిని తానే హత్య చేసినట్టు లోకేష్ అంగీకరించాడు.

బెయిల్‌పై వచ్చి మళ్లీ..

వధువు హత్య కేసులో జైలుకెళ్లిన లోకేష్ తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఆ తర్వాత కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో అతన్ని అరెస్ట్ చేయాలని కోర్టు నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో లోకేష్‌ను వెతికి పట్టుకోవాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి న్యూపోర్టు పోలీసులను ఆదేశించారు. ఈ క్రమంలో అతను విజయవాడలో ఉన్నాడని సమాచారం అందడంతో.. ఏఎస్‌ఐ మురళి, కానిస్టేబుల్ సింహాద్రిని న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు అక్కడకు పంపించారు. 12 సంవత్సరాల నుంచి తప్పించుకుని తిరుగుతున్న నిందితుడు లోకేష్‌ను ఎట్టకేలకు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

'సాక్షి' ఫొటోగ్రాఫర్లకు జాతీయ అవార్డులు



మోహన్‌రావు, నవాజ్

తాటిచెట్లపాలెం: ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్(ఏపీపీజేఏ), విజయవాడ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ–2025 పోటీల్లో 'సాక్షి'ఫొటోగ్రాఫర్‌లు పలు విభాగాల్లో అవార్డులు సాధించారు. 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు జరిగాయి. స్పాట్ న్యూస్ విభాగంలో పీఎల్ మోహన్‌రావు, జనరల్ న్యూస్ విభాగంలో ఎండీ నవాజ్‌లు ఏపీపీజేఏ అచీవ్‌మెంట్ అవార్డులను గెలుచుకున్నారు. వీరిని పలువురు అభినందించారు. కాగా.. ఈ పోటీలకు కోల్‌కతా, ముంబయి, న్యూఢిల్లీ, ఇండోర్, కేరళ, గోవా, కర్నాటక, చెన్నై, గుజరాత్, తెలంగాణ తదితర ప్రాంతాలకు చెందిన 135 మంది ఫొటోగ్రాఫర్లు రెండు విభాగాల్లో సుమారు 550 ఫొటోలను పంపించారు.